క్లుప్తంగా

ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు



నెల్లూరు(క్రైమ్): ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను ఆదివారం నిర్వహించారు. నగర ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుభాన్, నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరమ్మ, సౌత్ ఆర్‌ఐ రమణారెడ్డి నేతృత్వంలో ట్రాఫిక్ అధికారులు ప్రక్రియను చేపట్టారు. బ్రీత్ అనలైజర్‌తో పరీక్షలు చేశారు. మద్యం సేవించిన పలువురిపై కేసులు నమోదు చేసి సుమారు పదికిపైగా వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించి వాహనాలు నడుపుతున్న వారికి భారీగా జరిమానాలను విధించారు. మద్యం మత్తులో వాహనాలను నడిపితే జైలు తప్పదని హెచ్చరించారు.

ముగిసిన అండర్ - 19 చెస్ పోటీలు



కోవూరు: స్థానిక శ్రీచైతన్య పాఠశాల ఆవరణలో ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–19 ఓపెన్ చెస్ పోటీలు నిర్వహించారు. ఆదివారం ఈ చెస్ పోటీలు ముగిశాయి. ఈ పోటీల్లో పలు కేటగిరీల్లో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని అసోసియేషన్ కార్యదర్శి పి.మస్తాన్‌బాబు తెలిపారు. విజేతలకు హనుమంతరావు, డి.పెంచలబాబు బహుమతులు అందజేశారు.

భూమి పూజకు తరలిరండి

పొదలకూరు: నెల్లూరు నగరంలోని కొండాయపాళెం గేట్ సమీపంలో నిర్మించే జిల్లా యాదవ భవన్ భూమిపూజ ఈ నెల 12వ తేదీన నిర్వహిస్తున్నారని, ఈ కార్యక్రమానికి తరలి వచ్చి జయప్రదం చేయాలని యాదవ భవన్ నిర్మాణ ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు బొమ్మి నాగకిషోర్‌యాదవ్ పిలుపునిచ్చారు. స్థానిక బోగోలు కల్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భూమిపూజకు ముఖ్యఅతిథులుగా ఎంపీ బీదా మస్తాన్‌రావు, ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్, టీడీపీ నాయకుడు బీదా రవిచంద్ర, అల్పా హేచరీస్ చైర్మన్ దూడల సుధాకర్ హాజరవుతారని తెలిపారు. ఈ భవన్‌లో విద్యార్థులకు 70 హాస్టల్ గదులు, కల్యాణ మండపం, మినీ ఫంక్షన్‌హాల్, సంఘ కార్యాలయం గదులు నిర్మించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు అనంగి రమణయ్య, రాయి రమణయ్య, మయూరి శ్యాంప్రసాద్, పద్దాల వేమయ్య, వెడిచర్ల రమణయ్య, శ్రీహరి, లక్ష్మయ్య, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

బైక్‌లను ఆటో ఢీకొనడంతో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం: బైక్‌లను ఆటో ఢీకొని ఇద్దరు గాయపడిన ఘటన వెంకటాచలంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. నెల్లూరులోని బీవీనగర్ ప్రాంతానికి చెందిన నక్కా సాయికృష్ణ, క్రాంతి ఇద్దరూ వేర్వేరు బైక్‌లపై కసుమూరు వైపు నుంచి నెల్లూరు వైపునకు వెళుతుండగా, వెనుక నుంచి వస్తున్న ఆటో రెండు బైక్‌లను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయికృష్ణ, క్రాంతిలకు గాయాలు కావడంతో చికిత్సనిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నికలు



మనుబోలు: ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ మలోల అధికారులకు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ తాగునీటి వసతి, మరుగుదొడ్లు ఎలా ఉన్నాయని ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాల వద్ద వైద్యశిబిరం, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లోకి ఇతరులకు అనుమతి లేదని, ఓటరు గుర్తింపు కార్డు ఉన్న వారినే అనుమతిస్తారని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ సుధీర్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎస్సై ముత్యాలరావు, బీఎల్‌ఓ బుజ్జయ్య తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయానికి కృషి చేయండి

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఎంపీ, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నారాయణరెడ్డిపేటలో పార్టీ నేతలు, కార్యకర్తలు, గృహ సారథులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలోని అందరూ సమన్వయంతో వ్యవహరించి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. నెల్లూరు రూరల్ పరిధిలో అత్యధిక మెజార్టీ సాధించేలా కృషి చేయాలన్నారు. రూరల్ పరిధిలోని ప్రాంతాల అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తున్నానని వివరించారు. సమస్యల పరిష్కార విషయంలో ఆయా శాఖల అధికారులతో చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు చేపడతానని తెలిపారు. అభివృద్ధి పనులకు తగిన నిధులు మంజూరయ్యేలా తన వంతు కృషి చేస్తానని వెల్లడించారు. నియోజకవర్గ ప్రజలు తనను ఎప్పుడూ ఆదరిస్తారని, రాజకీయాల్లో తనకు శత్రువుల్లేరని చెప్పారు. తనను నమ్ముకున్న వారి కోసం తపన పడటమే నైజమన్నారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, పార్టీ నేత కమలాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరరెడ్డి, కార్పొరేటర్లు నాగరాజు, రామ్మోహన్, రైల్వే బోర్డు సభ్యుడు వెంకయ్య, నేతలు లక్ష్మీనారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, అంజిరెడ్డి, ఏసునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సింహవాహనంపై రంగనాథుడు





నెల్లూరు(బృందావనం): నగరంలో కొలువైన తల్పగిరి రంగనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సింహవాహనం, చంద్రప్రభ వాహనాలపై రంగడు ఆదివారం దర్శనమిచ్చారు. భక్తులు విశేషంగా హాజరై రంగనాథుడ్ని దర్శించుకున్నారు. ఉభయకర్తలుగా రాధాకృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, లేఖిన్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, తదితరులు వ్యవహరించారు. కాగా బ్రహ్మోత్సవాల్లో పల్లకి ఉత్సవం, హనుమంతసేవను సోమవారం నిర్వహించనున్నామని ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి తెలిపారు.

మహిళా సమానత్వం కోసం పోరాడాలి


మాట్లాడుతున్న విఠపు బాలసుబ్రహ్మణ్యం


హాజరైన మహిళలు

నెల్లూరు(వేదాయపాళెం): మహిళా సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ పోరాడాలని ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని హరనాథపురంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మహిళలకు అండగా నిలవాలని కోరారు. అనంతరం సైకాలజీ ప్రొఫెసర్ రంజిత నళిని, ఎల్‌ఐసీ ఉద్యోగుల అసోసియేషన్ మహిళా విభాగ కన్వీనర్ మాళవిక చక్రవర్తి మాట్లాడారు. బాల్యదశ నుంచే ఆడ, మగ సమానమనే భావనతో పిల్లలను పెంచాలని కోరారు. సమస్యలొచ్చినప్పుడు మహిళలు ధైర్యంగా ఎదుర్కొనేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తీర్చిదిద్దాలని, అప్పుడే సమాజం చైతన్యమవుతుందని చెప్పారు. జేవీవీ సమతా విభాగ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, అధ్యాపకురాలు భారతి, పద్మ, ఆశ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, అంగన్‌వాడీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సుజాతమ్మ, శివకుమారి, తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

అనుమానాస్పద మృతిపై ఫిర్యాదు



నెల్లూరు రూరల్: వ్యక్తి అనుమానాస్పద మృతిపై రూరల్ పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. వివరాలు.. కోడూరుపాడుకు చెందిన వెంకటేశ్వర్లు (57) వ్యవసాయ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో పొలం పనుల నిమిత్తం శనివారం మధ్యాహ్నం వెళ్లారు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో పొలం వద్దకు కుటుంబసభ్యులు బయల్దేరగా, మార్గమధ్యలో వెంకటేశ్వర్లు మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లిన కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. పాముకాటుకు గురయ్యారా.. లేక ఏదైనా కారణమా ననే అంశంపై దర్యాప్తు చేయాలని కోరారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లీకుమార్తె అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): తల్లీకుమార్తె అదృశ్యమైన ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. సూళ్లూరుపేటకు చెందిన తులసీ, శ్రావణకుమార్ దంపతుల నడుమ విభేదాలున్నాయి. ఇటీవల ఆమె తన ఏడేళ్ల కుమార్తె ప్రణవికతో కలిసి నెల్లూరు జేవీఆర్ కాలనీలోని తన చిన్నాన్న ఇంటికి ఫంక్షన్ నిమిత్తం వచ్చారు. తమను భర్త ఇబ్బందులకు గురిచేస్తున్నారని చిన్నాన్నకు చెప్పి కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న భర్త నెల్లూరొచ్చి ఆమెతో గొడవపడ్డారు. ఈ తరుణంలో ఇక నుంచి నీకు కనిపించనని భర్తకు శనివారం మెసేజ్ పంపి కుమార్తెతో సహా అదృశ్యమయ్యారు. ఈ మేరకు దర్గామిట్ట పోలీసులకు ఆమె కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో.. ఎటో





ఆటోవాలాలు నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘించి మితిమీరిన వేగంతో రహదారులపై దూసుకెళ్తున్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలించి ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఆటో డ్రైవర్లు నిబంధనలను ఉల్లంఘిస్తున్నా, సంబంధిత అధికారులు చర్యలు చేపట్టడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. వీరిపై ఇప్పటికైనా తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– నెల్లూరు(క్రైమ్)

ఎంపీ ఆదాలకు సత్కారం



నెల్లూరు రూరల్: ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికైన మేరిగ మురళీధర్ మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. ఎంపీకి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(సెంట్రల్): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి.. ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని వారి కార్యాలయాల్లో పార్టీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన ముత్యంగౌడ్ మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై మాట్లాడారు.

- **నెల్లూరు(బృందావనం):** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌ను నగరంలోని వారి కార్యాలయాల్లో పార్టీ సాంస్కృతిక విభాగ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన నారాయణబాబు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎస్డీపీఐ కార్యవర్గ ఎన్నిక



నెల్లూరు(వీఆర్సీసెంటర్): కోటమిట్టలోని సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్డీపీఐ) కార్యాలయంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గ కార్యవర్గ సభ్యుల ఎన్నికను ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మహ్మద్ ఘనీ, జిల్లా అధ్యక్షుడు రఫీ హాజరయ్యారు. నెల్లూరు రూరల్ కమిటీ అధ్యక్షుడిగా మస్తాన్‌వలీ, ప్రధాన కార్యదర్శిగా అహ్మద్, ఉపాధ్యక్షుడిగా మోహన్, సహాయ కార్యదర్శిగా మహబూబ్‌బాషా, కోశాధికారిగా సలీమ్, ఏడుగురితో కౌన్సిల్‌ను ఎన్నుకున్నారు.

పన్ను బకాయిల చెల్లింపునకు పది కేంద్రాల ఏర్పాటు

నెల్లూరు సిటీ: ఆస్తి, కుళాయి, డ్రైనేజీ పన్ను బకాయిలను చెల్లించేందుకు గానూ పది కేంద్రాలను ఏర్పాటు చేశామని కమిషనర్ హరిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏసీనగర్, ఆరెస్సార్ హైస్కూల్ వద్ద గల సచివాలయం, పాత మున్సిపల్ కార్యాలయం, టీచర్స్ కాలనీలోని 26 – 1, పడారుపల్లిలోని 24 – 2, కొత్తూరులోని 30 – 1, ఆనం వెంకటరెడ్డి విగ్రహ సమీపంలోని 19 – 1 వార్డు సచివాలయాలు, కార్పొరేషన్ కార్యాలయంలో రెండు కేంద్రాలు, అల్లీపురంలోని పాత పంచాయతీ కార్యాలయంలో కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు.

చర్చిలో సంఘ ఆరాధన



నెల్లూరు(బృందావనం): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిప్పో సెంటర్ సమీపంలోని యునైటెడ్ గుడ్ న్యూస్ బాప్టిస్ట్ చర్చిలో సంఘ ఆరాధనను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను సత్కరించారు. సంఘ కాపరి రెవరెండ్ రాజశేఖర్ పాల్గొన్నారు.

పేర్నాటికి మద్దతుగా ప్రచారం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ సూచనల మేరకు 53వ డివిజన్ పరిధిలోని నల్లకాలువ, గాంధీగిరిజన కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి కార్పొరేటర్ సుజాత ప్రచారం చేశారు. పార్టీ నేతలు శ్రీనివాసులురెడ్డి, సహదేవరెడ్డి, విజయ్, బ్రహ్మరెడ్డి, లక్ష్మీనారాయణ, ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి



నెల్లూరు రూరల్: బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తానని దక్షిణ సింహపురి బ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో సంఘ కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా ప్రసాద్‌రావు, కోశాధికారిగా మధుసూదన్‌రావు, నలుగురు ఉపాధ్యక్షులు, ముగ్గురు సంయుక్త కార్యదర్శులు, పది మంది కార్యనిర్వాహక సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల ప్రతినిధిగా నరసింహ ప్రకాశం వ్యవహరించారు.

ఎల్‌ఐసీలో పెట్టుబడులు సురక్షితం


మాట్లాడుతున్న శ్రీనివాస్

నెల్లూరు(అర్బన్): ఎల్‌ఐసీలో ప్రజలు పెట్టుబడిగా పెట్టే ప్రతి రూపాయి సురక్షితంగా ఉంటుందని, అందుకే అశేష ఆదరణ పొందిందని నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాల మార్కెటింగ్ మేనేజర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. అన్నమయ్య సర్కిల్లోని ఓ హోటల్ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన ఎల్‌ఐసీ ఏజెంట్ల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. దేశంలో 23 ప్రైవేట్ ఇన్సూరెన్స్ సంస్థలున్నా, ఇప్పటికీ 70 శాతం వాటా ఎల్‌ఐసీదేనన్నారు. ఎల్‌ఐసీ ఆస్తులు రూ.44 లక్షల కోట్లు అని, ఇందులో అదానీ సంస్థ షేర్లలో ఒక్క శాతం పెట్టుబడి కూడా పెట్టలేదని తెలిపారు. మార్చిలో రూ.ఐదు లక్షలకు పైబడిన ప్రీమియం పాలసీలకు పలు రాయితీలుంటాయని చెప్పారు. అనంతరం ఎక్కువ పాలసీలు సేకరించిన పలువురు ఏజెంట్లను సత్కరించారు. నెల్లూరు డివిజన్ ఎస్‌ఎం దుర్గాప్రసాద్, బుచ్చిరెడ్డిపాళెం బ్రాంచ్ మేనేజర్ బాలాజీబాబు, డెవలప్‌మెంట్ ఆఫీసర్ బాలసుబ్రహ్మణ్యం, చలపతిరాజు, ఏట చెన్నకేశవులు, తదితరులు పాల్గొన్నారు.

ఏసీ స్టేడియంలో వైద్య శిబిరం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వైద్య శిబిరాన్ని స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. బీపీ, షుగర్ పరీక్షలను డాక్టర్లు శ్రీధర్‌రెడ్డి, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిపారు. అనంతరం వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు రఘురామ్ ముదిరాజ్, గౌరవాధ్యక్షుడు తిరుపతి నాయుడు, కోశాధికారి అనంతరామారావు, మాజీ అధ్యక్షుడు శేషగిరిరావు, వాకర్స్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ కోశాధికారి బలరామయ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మందుల అందజేత



నెల్లూరు(బృందావనం): వికాస్ ఆరోగ్య దీపిక పథకం ద్వారా పేదలకు మందులను బాలాజీనగర్‌లోని వికాస్ ప్రజాహిత సేవా సమితి కార్యాలయంలో ఆదివారం పంపిణీ చేశారు. రూ.50 వేల విలువైన మందులను కార్యక్రమ నిర్వాహకుడు, 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమానికి సహకారం అందిస్తున్న దాతలకు కృతజ్ఞతలను తెలియజేశారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న అధికారులు

నెల్లూరు(అర్బన్): కేన్సర్‌పై అవగాహన పెంచుకొని ముందస్తు జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి రమేష్‌నాథ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏసీ స్టేడియం నుంచి కరెంటాఫీస్, వేదాయపాళెం, తదితర ప్రాంతాల మీదుగా ప్రభుత్వ మెడికల్ కళాశాల వరకు సైకిల్ ర్యాలీని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. జంక్‌ఫుడ్, నిద్రలేమి, కాలుష్యం, కల్తీ ఆహారం, ధూమపానం, తదితరాలతో కేన్సర్ ఎక్కువగా వస్తోందని చెప్పారు. 30 ఏళ్లు దాటిన మహిళలు ఏడాదికోసారైనా ప్రాథమిక కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మురళీకృష్ణ, డాక్టర్ సుధీర్‌కుమార్, పీఎంపీ అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, సత్తార్, తదితరులు పాల్గొన్నారు.

హక్కులను తెలుసుకోవాలి


మాట్లాడుతున్న శ్రీనివాసులునాయక్

నెల్లూరు(వేదాయపాళెం): బాలికలు, మహిళలకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులునాయక్ పేర్కొన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బట్వాడిపాళెంలోని సంక్షేమ బాలికల వసతి గృహం, పీజీ హాస్టల్లో న్యాయ విజ్ఞాన సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.